క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి అత్యధిక స్థానాలు ఖాయం


కంభం విజయరాజు

చింతలపూడి: జిల్లాలో వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ధీమా వ్యక్తం చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో తాను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుస్తానన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి కె సునీల్‌కుమార్ యాదవ్‌కు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ వస్తుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండుటెండల్లో కష్టపడి తిరిగి నిరంతరం శ్రమించి పని చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో గ్రామ, గ్రామాన తనను ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ బలమైన శక్తిగా అవతరించిందన్నారు. ప్రజలు జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలన్న కసితో సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓట్లు వేశారని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తారని చెప్పారు. ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాధాకృష్ణ పేర్కొన్నారు. 33 కేవీ లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ చేసే నేపథ్యంలో కొయ్యలగూడెం, బోడిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో...

వేలేరుపాడు: పి.నారాయణపురం సబ్‌స్టేషన్ నుంచి రాచన్నగూడెం సబ్‌స్టేషన్‌ల మధ్య గల 33 కేవీ హైటెన్షన్ లైన్‌పైన చెట్లు కొమ్మలు నరకడం, ఇతర మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెం సబ్‌స్టేషన్, వేలేరుపాడు మండలంలోని వేలేరుపాడు సబ్‌స్టేషన్, కుక్కునూరు మండలంలోని కుక్కునూరు, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం సొమ్ము విడుదల చేయాలి

ఏలూరు (టూటౌన్): రబీ ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాల్సిన సమయం రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధాన్యం బకాయి సొమ్ములు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో 80 వేల ఎకరాల్లో 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని లక్ష్యాన్ని నిర్దేశించడం వల్ల కొంత మేరకు ధాన్యం రైతుల వద్దనే ఉండిపోయిందని చెప్పారు. రబీ ధాన్యానికి 21 రోజుల నిబంధనతో నిమిత్తం లేకుండా సొమ్ము చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా దృక్పథంతో చేసిన సేవలు అభినందనీయమని సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం సాధారణ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా పోలీసులతో కలిసి విధులను నిర్వహించిన భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను క్యూలైన్లలో నిలబెట్టడం, వారి పీఎస్‌లను తెలియజేయడం, శాంతిభద్రతలకు సమస్య ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి సేవలను వలంటీర్లు అందించారని కొనియాడారు. మండలంలోని 14 మంది వలంటీర్లు భీమడోలు, గుండుగొలను, పూళ్లలతో పాటు పలు గ్రామాల్లో వారి సేవలందించారని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వారికి ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

దెందులూరు: శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, ప్రధానంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుమలత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, శాఖాపరమైన నివేదికలను చదివి వినిపించారు.

సేంద్రియ సాగుతో పుడమికి జీవం

- ప్రకృతి సాగుపై గిరిజన రైతుల్లో చైతన్యం
- మంచి ఫలితాలు సాధిస్తున్న మన్య ప్రాంత రైతులు
- ఆవు పేడ, మూత్రంతో ఎరువుల తయారీ
- ఉల్లిపాయలతో కషాయాలు, కోడిగుడ్లు, నిమ్మరసాలు, చేపలు, బెల్లంతో ద్రవణాలు
- ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేస్తున్న అధికారులు
- పోలవరం నియోజకవర్గ పరిధిలో సుమారు 16,052 ఎకరాల్లో ప్రకృతి సాగు


ఆవు పేడతో ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం


కషాయాలు తయారు చేస్తున్న రైతులు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని వ్యవసాయ భూములు సారవంతంగా ఉంటాయి. భూమి లోతుల్లోకి వెళ్లే కొద్దీ మట్టిలో పోషకాల పరిమాణం పెరుగుతూ ఉంటుంది. ఈ ప్రాంతంలోని రైతులు ప్రతి వ్యవసాయ సీజన్ ప్రారంభంలో పశువుల పేడను భూముల్లో చల్లుతూ ఉంటారు. ఈ ప్రాంతంలో పశువుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పేడ, మూత్రం పుష్కలంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు దృష్టి సారించారు. దీనిలో భాగంగా కచ్చితమైన ప్రణాళికలతో సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కలిగిస్తూ పంటల్లో అధిక దిగుబడి సాధించే విధంగా కృషి చేస్తున్నారు. ప్రతి ఏటా ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలో సుమారు 16,052 ఎకరాల్లో సుమారు 13,600 మందికి పైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, పప్పు దినుసులు, ప్రత్తి, కూరగాయలు, తదితర పంటలను పండిస్తున్నారు. అయితే ఆయా పంటలకు సంబంధించి చీడ, పీడల నివారణకు అవసరమయ్యే సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీపై కూడా గిరిజన రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

ఆవుపేడ, మూత్రాలతో ఎరువుల తయారీ

రైతులకు సేంద్రియ వ్యవసాయంపై పూర్తి అవగాహన కలిగించడమే కాకుండా ఆ పంటల్లో వచ్చే చీడ, పీడ పురుగుల నివారణకు అవసరమయ్యే మందులను కూడా వారే తయారు చేసుకునే విధంగా అధికారులు శిక్షణ ఇస్తున్నారు. రైతులు సొంతంగా ఆవుపేడ, మూత్రాలతో జీవామృతం, కషాయాలను తయారు చేసుకుని వారి పంటలకు వినియోగిస్తున్నారు. ఆవుపేడ, మూత్రాలతో సేంద్రియ ఎరువుల తయారీపై కూడా శిక్షణ ఇస్తున్నారు.

ఘన జీవామృతంతో పంటలకు శ్రీరామరక్ష

వరిసాగు చేపట్టే రైతులకు దుక్కుదున్నే సమయంలోనే ఘనజీవామృతం వినియోగంతో భూమి సారవంతమవుతుంది. వానపాములు ఆరోగ్యంగా వ్యాప్తి చెంది భూమికి సారవంతమైన పోషకాలు అందిస్తాయి. చీడ, పీడల నివారణతో పాటు పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. దీని తయారీకి 100 కిలోల ఆవుపేడ, 5 కిలోల ఆవు మూత్రం, 2 కిలోల బెల్లం లేదా చెరకు రసం, 2 కిలోల ఏదైనా పప్పు ధాన్యాల పిండి, అర కిలో గట్టు మన్ను అవసరం ఉంటుంది. వీటన్నింటినీ చేత్తో బాగా కలిపి 10 రోజులు నీడలో ఆరబెట్టాలి. తర్వాత 10 కిలోల గెత్తంతో కలిపి 10 ఎకరాల పొలంలో చల్లి కలియ దున్నాలి.

జీవామృతంతో సకల పోషకాలు

జీవామృతంతో పంటలకు సకల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వరి పంటకు నీరు పారించే సమయం నుంచి పంట దిగుబడి వచ్చే వరకూ జీవామృతం ప్రతి 15 రోజులకు ఒక సారి 100 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలి. జీవామృతం వినియోగిస్తే భూమిలో సూక్ష్మజీవరాశి పెంపొంది నేల ఆరోగ్యవంతమవుతుంది. తద్వారా భూమి మొక్కలకు సకల పోషకాలను అందిస్తుంది. ఎటువంటి ఎరువులు వాడకుండానే అధిక దిగుబడులు సాధించవచ్చు. దీని తయారీకి 10 కిలోల ఆవుపేడ, 5 నుంచి 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కిలోల బెల్లం లేదా చెరకు రసం, 2 కిలోల ఏదైనా పప్పు ధాన్యాల పిండి, అరకిలో గట్టు మట్టి, 200 లీటర్ల నీరు అవసరం. తొట్టి లేదా డ్రమ్ముల్లో 200 లీటర్ల నీరు పోసి అందులో ఈ పదార్థాన్ని బాగా కలిపి నీడలో 48 గంటలపాటు ఉంచాలి. రోజూ రెండు మూడుసార్లు కర్రలతో కుడివైపు తిప్పాలి. ఇది ఎకరానికి సరిపోతుంది. తయారైన తర్వాత 48 గంటల్లోపే దీనిని వినియోగించుకోవాలి. తొలుత పంటకు నీరు పారించే సమయంలో దీనిని పొలంలో వినియోగించాలి. ఎప్పటికప్పుడు తయారు చేసుకుంటూ వరినాట్లు పూర్తయిన 15 రోజులకు ఎకరం భూమిలో 5 లీటర్ల జీవామృతాన్ని 100 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. ఇలా ప్రతి 15 రోజులకు ఒకసారి దిగుబడి వచ్చే వరకూ 10 దఫాలుగా పిచికారీ చేయాలి.

ప్రకృతి వ్యవసాయ సాగు పెరుగుతుంది



ప్రకృతి వ్యవసాయ సాగు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆరోగ్యవంతమైన పంటలు పండించేలా కృషి చేస్తున్నాం. రైతులకు పంటలపై చీడ, పీడల నివారణకు అవసరమయ్యే ఎరువులు, కషాయాల తయారీకి శిక్షణ ఇస్తున్నాం. ప్రతి ఏటా ప్రకృతి సాగు పెరుగుతుంది.

– పి.తాతారావు, ఏపీ సీఎస్‌ఎఫ్ డీపీఎం, ఏలూరు

విత్తన శుద్ధికి బీజామృతం

- బీజామృతంతో విత్తన శుద్ధి చేపడితే నారు మడులకు చీడ పీడల బారిన పడవు. దీని తయారీకి 20 లీటర్ల నీరు, 5 లీటర్ల ఆవుమూత్రం, 5 కిలోల ఆవుపేడ, 50 గ్రాముల పొడి సున్నం, దోసెడు పొడి మట్టి అవసరం.
- ఆవుపేడను పలుచటి గుడ్డలో మూట కట్టి 20 లీటర్ల నీరున్న తొట్టిలో 12 గంటలు ఉంచాలి.
- పాత్రలో లీటరు నీటని తీసుకుని 50 గ్రా.ల సున్నాన్ని రాత్రంతా నానబెట్టాలి.
- రెండవ రోజు ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేత్తో పిండి సారాన్ని నీటి తొట్టిలో కలపాలి.
- పేడ నీళ్లున్న తొట్టిలో పొడిమట్టిని పోసి కలియతిప్పాలి.
- 5 లీటర్‌ల ఆవు మూత్రాన్ని, సున్నపు నీటిని, పేడ నీరున్న తొట్టిలో పోసి పూర్తిగా కలిసిపోయేలా కుడివైపునకు తిప్పాలి. అన్నీ బాగా కలిపిన తర్వాత బీజామృతం తయారవుతుంది. 12 గంటల పాటు నిల్వ ఉంచాక మరుసటి రోజు ఉదయం నుంచి 48 గంటలలోపు పంటలకు వినియోగించాలి. వరి విత్తనాలకు ఈ బీజామృతం బాగా పట్టించి నీళ్లలో ఆరబెట్టి తర్వాత భూముల్లో నాటు కోవాలి. ఇతర చిరు ధాన్యాల పంటల విత్తనాలకు మాత్రం పైపైన బీజా మృతాన్ని పిచికారీ చేసి తడి ఆరాక విత్తుకోవాలి.

105 సంఘాల ఆధ్వర్యంలో కందుకూరి వర్ధంతి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27న కందుకూరి వీరేశలింగం 105వ వర్ధంతి కార్యక్రమాన్ని 105 సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు తెలిపారు. కందుకూరి వర్ధంతి సమాలోచన కార్యక్రమాన్ని స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో గురువారం నిర్వహించారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి వీజీఎంఆర్ కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో నరసింహారావు మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సమాలోచన సదస్సు పుస్తకావిష్కరణ, పుస్తక ప్రదర్శనలు, చాట్స్ ఎడ్యుకేషన్‌తో కందుకూరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అతిథులుగా సర్ సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్వీ ప్రసాద్, డిగ్రీకళాశాల కరస్పాండెంట్ కేవీ విష్ణుమోహన్ హాజరవుతారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక, ప్రజాశక్తి బుక్ హౌస్ ముద్రించిన సాహిత్య ప్రదర్శన, కందుకూరి జీవితంపై ఫొటో ఛార్ట్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కందుకూరి వర్ధంతి బ్రోచర్లు, ఫ్లెక్సీలను విడుదల చేశారు.

సాగుకు సన్నద్ధం..

వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపు


చింతలపూడి మండలంలో ఖరీఫ్ నారుమళ్లు పోసుకోవడానికి దుక్కులు దున్నుకుంటున్న రైతు

చింతలపూడి: ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో మెట్ట ప్రాంత రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్ సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్న రైతులు వర్షాలకోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా ఆకాశం మేఘావృత్తమై ఉండటం, అడపాదడపా చినుకులు పడుతుండటంతో ఈ ఏడాది వర్షాలు ముందుగానే పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నెలాఖరుకు రుతుపవనాలు కేరళను తాకే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురిసేలా ఉన్నాయి. దీంతో రైతులు పొలాల్లో ఎరువులు తోలుకుని, దుక్కులు దున్నుకుని, నారుమళ్లు పోసుకోవడానికి సంసిద్ధులవుతున్నారు. తొలకరి వర్షాలు కురిస్తే వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఏటా మే నెల చివర్లో దుక్కులు దున్నుకుని జూన్ 15 నాటికి నారుమళ్లు పోసి జూలై 15 నాటికి నాట్లు వేయడం పూర్తి చేస్తారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో 450 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఏటా సుమారు 17,000 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వర్షాలు పలకరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటనలతో వర్షాలు కురుస్తాయన్న ధీమాతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ రైతులకు సకాలంలో అందించేలా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

అందుబాటులో విత్తనాలు



ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది. రుతుపవనాల ప్రభావంతో మెట్ట ప్రాంతంలో వర్షాలు ప్రారంభం అయ్యే నాటికి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచుతాం.

– బి నాగకుమార్, సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ

నేటినుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షిక వేడుకలు

టి.నరసాపురం: ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు టి.నరసాపురంలో శ్రీగోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రథమ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు లక్కోజు నాగేశ్వరరావు, కొక్కొళ్ల శ్రీనివాసాచార్యులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభించి 6 గంటలకు గంగ పూజ, గోపూజ, విఘ్నేశ్వర పూజతో పాటు స్వామి, అమ్మవార్ల మూలమూర్తులకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే 18వ తేదీన సుప్రభాత సేవ, స్వామి, అమ్మవార్లకు నవరసాభిషేకం, పంచామృతాభిషేకాలు, 108 కలశాలతో విశేష పూజలు నిర్వహిస్తామని వివరించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 19వ తేదీన ప్రత్యేక పూజలతో పాటు అఖండ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరలించాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం


వంక బొత్తప్పగూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గిరిజన గ్రామమైన వంక బొత్తప్పగూడెంలో గురువారం సికిల్‌సెల్ ఎనీమియా రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో నలభై సంవత్సరాలలోపు వయసున్న గిరిజనులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామ ప్రజలకు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. రక్తనాళాల సంఖ్య తగ్గడం, తద్వారా రక్తహీనతకు గురవడం, ఎర్ర రక్తకణాలు రెండు రోజులకు మించి బ్రతకవని, సాధారణ వ్యక్తుల్లో ఎర్ర రక్తకణాలు నూట ఇరవైరోజులు వరకూ ఉంటాయన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా రోగిలో రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారడం వలన రక్తం సరఫరాకు అంతరాయం కలుగుతుందని, గుండెకు ఆక్సిజన్ సరఫరా సరిగా అందకపోవడం వలన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, అలసటగా ఉండటం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఇది అంటువ్యాధి కాదని, జన్యుపరంగా సంక్రమించే వ్యాధి అని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సుబ్రహ్మణ్యం గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చాన్ బాషా, హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్బారావు, ఏఎన్‌ఎం పి.జయప్రద, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.విమల, ఆశ వర్కర్ వి.కుమారి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు సహకరించండి


యర్రగుంటపల్లి పీహెచ్‌సీ వద్ద డెంగీ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: డెంగీ వ్యాధికి కారణమైన దోమల నిర్మూలనకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని వైద్యాధికారిణి డా ఎస్ గీత పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణా దినోత్సవం సందర్భంగా గురువారం యర్రగుంటపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో డెంగీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా ఎస్ గీత మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఏవిధంగా వ్యాప్తి చెందుతుందో ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. డెంగీ దోమలు పెరిగే పూలకుండీలు, కూలర్లు, నీటి తొట్టిలు, నిల్వ నీటి పాత్రలు శుభ్రం చేసుకోవడం ద్వారా దోమలను అదుపు చేయవచ్చునన్నారు. ఎడిస్ జాతి (పులిదోమ) పగలు మాత్రమే కుడుతుందని దాని వలన డెంగీ వస్తుందన్నారు. ఇంటి తలుపులకు, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ప్రభుత్వం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసరావు, డా కె నరేష్, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్ శంకర్, రసూల్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది ర్యాలీ


బయ్యన్నగూడెంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బయ్యన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు వి.సత్యనారాయణ, ఎం.గీతారాణి డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉన్నచోట, వాడి పడేసిన కొబ్బరి బొండాల్లో, పాత టైర్లలో, పగిలిన, వాడని కుండల్లో నీరు నిలవ ఉండటం వలన ఈ దోమలు వృద్ధి చెందుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, పీహెచ్‌ఎన్ మేరీగోల్డ్, హెచ్‌ఎస్ భాష, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలే ముందు వరుసలో..

- చింతలపూడి నియోజకవర్గంలో 81.52 శాతం ఓటింగ్ నమోదు
- లింగపాలెంలో అత్యధికంగా, జంగారెడ్డిగూడెంలో అత్యల్పంగా ఓటింగ్ నమోదు
- పురుషుల కంటే అధికంగా అతివల ఓటింగ్


జంగారెడ్డిగూడెంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళలు (ఫైల్)

జంగారెడ్డిగూడెం: అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కు వినియోగించుకోవడంలో కూడా వారి చైతన్యం చూపించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పురుషుల కంటే అతివలే అధికంగా ముందుకొచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో జూన్ 4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యాల్లో మహిళా శక్తి కీలకం కానుంది. చింతలపూడి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1229 మంది మహిళలు అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,73,069 మంది మొత్తం ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,34,295 మంది, మహిళలు 1,38,733 మంది, ఇతరులు 41మంది ఉన్నారు. వీరిలో 1,10,679 మంది పురుషులు, 1,11,908 మంది మహిళలు, 21మంది ఇతరులు ఓటు వేశారు. మొత్తం మీద 2,22,608 మంది తమ ఓటును వినియోగించుకోగా, 81.5 2శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గం నాలుగు మండలాల్లో లింగపాలెం మండలంలో అత్యధికంగా 89.4 శాతం పోలింగ్ నమోదు కాగా, జంగారెడ్డిగూడెం మండలంలో 76.67 శాతం అత్యల్ప పోలింగ్ నమోదైంది.

చింతలపూడి మండలంలో 83.26 శాతం పోలింగ్

చింతలపూడి మండలంలో మొత్తం ఓటర్లు 74,786 మంది ఉండగా, వీరిలో పురుషులు 36,726 మంది, మహిళలు 38,054 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. వీరిలో పురుషులు 30,658 మంది, మహిళలు 31,609 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 951మంది మహిళలు అధికంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలం మొత్తంగా చింతలపూడి పట్టణం మండలం కలిపి 62,267 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. 83.26 శాతం పోలింగ్ నమోదైంది.

జంగారెడ్డిగూడెం మండలంలో 76.67 శాతం పోలింగ్

జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం కలిపి మొత్తంగా 1,00,203 ఓటర్లు ఉండగా, పురుషులు 48978 మంది, మహిళలు 51,193 మంది, ఇతరులు 32 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 38,044, మహిళలు 38,767 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ కూడా 723 మంది మహిళలే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, ఇతరులు 21మంది ఓటును వేశారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం మొత్తం మీద 76,832 మంది తమ ఓటును వినియోగించుకోగా, 76.67 శాతం పోలింగ్ నమోదైంది.

కామవరపుకోట మండలంలో 81.23 శాతం పోలింగ్

కామవరపుకోట మండలంలో మొత్తంగా 51,156 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 25,183 మంది, మహిళలు 25,970 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరిలో పురుషులు 20,805 మంది, మహిళలు 20,751 మంది ఓటును వినియోగించుకున్నారు. ఇక్కడ పురుషులు 54 మంది అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 41,556 మంది ఓటు వేశారు. ఇక్కడ 81.23 శాతం పోలింగ్ నమోదైంది.

లింగపాలెం మండలంలో 89.40 శాతం పోలింగ్

లింగపాలెం మండలంలో 46,924 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 23,408 మంది, మహిళలు 23,516 మంది ఉన్నారు. వీరిలో 21,172 మంది పురుషులు, 20,781 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ పురుషులు 391 మంది అధికంగా తమ ఓటును వినియోగించుకున్నారు. మొత్తంగా 41,953 మంది తమ ఓటును వినియోగించుకోగా, 89.40 శాతం పోలింగ్‌నమోదైంది.